ఆ గజ్జెలు మూగవోయాయి, ఆ కంఠం విషాదం ముడిలో చిక్కుకుంది. మళ్ళీ గజ్జెల గలగల యెలా వినిపించింది? మళ్ళీ ఆ కంఠం యెలా విడివడింది?

తను చిన్న బడిపంతులైనప్పటికీ కూతురు శారద గొప్ప నర్తకి కావాలని రాజారావు ఎన్నో కలలు కన్నాడు. చాలీచాలని జీతంతో సతమతమవుతున్నప్పటికీ పేరుమోసిన గురువుల దగ్గర నాట్యం నేర్పించాడు.

శారద నాట్యం చేస్తుంటే నీలాకాశంలో మెరుపు తీగ తళుక్కుమన్నట్లు, శ్రావణ మేఘం చూసి ఉప్పొంగే వనమయూరం చిందులు వేసినట్లు, శిలాఖండాలమీద సెలయేరు తుళ్ళింతలాడినట్లు, చిరుగాలిలో పుష్పలత ఒయ్యారంగా కదలాడినట్లు రాజారావు కళ్ళు ఆనందాశ్రువులతో నిండిపోయేవి.

# మళ్ళీ గజ్జెల గలగల

అమరేంద్ర



తన కూతురు ఊరూరా నృత్యప్రదర్శనాలు చేసి బహుమతులూ, ప్రశంసలూ సంపాదించాలి. తను చేసిన త్యాగానికీ, కూతురు చేసిన కృషికీ, చూపిన దీక్షకూ రసజ్ఞుల మన్ననలు ఉత్తమ ప్రతిఫలం అందించాలి. తన కలలు ఫలించే శుభ తరుణం కోసం రాజారావు నిరంతరమూ నిరీక్షిస్తున్నాడు.

ఇదొక ఛాదస్తం అని బంధువులు పెదిమలు విరిచారు.

కూటికా గుడ్డకా ఈ విద్య? తగిన సంబంధం చూసి పెళ్ళి చేసెయ్యమని స్నేహితులు ఉచిత సలహాలిచ్చారు.

కూతురుచేత గజ్జె కట్టించి ఆ సంపాదనతో మేడలు కడదామనుకుంటున్నావా అని ఎగతాళి చేశారు స్కూలు హెడ్మాస్టరుగారు.

అయినప్పటికీ రాజారావు చలించలేదు. భార్య లక్ష్మికూడా ఆయనతో సహకరించి కూతురు భవిష్యత్తును గురించి రాజారావు కంటున్న బంగారు కలలను పంచుకునేది. ఎన్ని ఇబ్బందులూ కష్టాలు ఎదురైనప్పటికీ చెదిరిపోని మనోబలంతో భార్యాభర్తలిద్దరూ శారదను ప్రఖ్యాత నర్తకీమణిగా దిద్ది తీర్చాలనే ఆశయంతో పెనగులాడుతున్నారు.

శారద రంగపూజచేసి మొదటి ప్రదర్శనలోనే రసికుల ప్రశంసలు విశేషంగా పొందిన శుభదినాన రాజారావు అపారమైన ఆనందంలో ఓలలాడిపోయాడు. అప్పటినుంచీ పెద్దపెద్ద నగరాలలో ప్రదర్శనల పరంపరలు, కీర్తి, ధనమూ కూడా శారద సంపాదించసాగింది. కూతురు నృత్య బృందంతో రాజారావు కూడా వూరూరా తిరుగుతూ నీడలాగా వెన్నంటి వుండేవాడు. కంటికి రెప్పలాగా శారదను కనిపెట్టి వుండేవాడు. రేకులు విప్పుతున్న పద్మంలాగా శారదలో నాట్యకళా

వైభవం క్రమ వికాసం పొందటం చూసి తన తపస్సు ఫలించిందని మురిసిపోయాడు.

కాని తిరుపతిలో కళాభారతివాళ్ళు ఏర్పాటుచేసిన ప్రదర్శనానికి ముందు రోజున రాజారావుకి తీవ్రమైన జ్వరం వచ్చింది కూడావెళ్ళలేకపోయాడు. శారగ ఒంటరిగా తన బృందంతో ప్రదర్శనానికి వెళ్ళింది.

తిరిగివచ్చిన తరవాత శారగ చెప్పిన సంగతి విని పిడుగు దెబ్బకు నేలకూలిన చెట్టులాగా రాజారావు కుర్చీలో కూలబడిపోయాడు. తల్లితోగాని. తనతోగాని మాట మాత్రమైనా చెప్పకుండా శారద ఇంతటి సాహసం చేస్తుందని ఎన్నడూ అనుకోలేదు. తన ఆశలన్నీ పేకమేడలాగా క్షణంలో కూలిపోయాయి. చెప్పలేని వేదనతో తల్లి హృదయం తల్లడిల్లిపోయింది.

తిరుపతిలో ప్రదర్శనం పూర్తిఆయాక శారద కొండమీదకి వెళ్ళి గుళ్ళోపెళ్ళి చేసుకుని వచ్చింది. నాట్య బృందంలో ఫిడేలు వాయించే మధుని వివాహమాడిందట. "నిజంగానా?" అని విస్మయంతో ప్రశ్నించాడు తన చెవులను తనునమ్మలేక.

శారదేనా తనతో ఈ విధంగా మాట్లాడుతున్నది అని నివ్వెరపోయాడు.

తమది పరమ పవిత్ర ప్రణయమట ఈ కళ్యాణబంధం అవిచ్ఛిన్నమైన జన్మజన్మల అనుబంధమట.

"మమ్మల్ని దీవించండి నాన్నగారూ?" అంటూ రాజారావు పాదాలకు శారద ప్రణామం చేసింది.

మధు కూడా పాదాభివందనం చేశాడు.

రాజారావుకు నోట మాట పెగలలేదు. శారద తల మీద చెయ్యివేశాడు. గజగజ వణికింది చెయ్యి. కన్నీరు గిర్రున తిరిగింది.

"మేము బతికే వున్నాంకదా. మాట మాత్రమైనా చెప్పలేకపోయావా?" అంది


రీటా మీ కేశ సంపదకు



జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా. దానిలో అటువంటి శక్తీ, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా, చక్కగా పెరగడానికీ, నల్లదనానికీ, దానికదే సాటి.

రీటా వాడి. మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి.




రీటా

నేడే ఒక సీసా కొనండి
ప్రతిచోటా దొరుకును

స్త్రీలూ పురుషులూ

ఇప్పుడు సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది.

శత్రు భయమా? బలంగా, ధైర్యంగా, స్త్రీ పురుషులు ఆత్మ రక్షణకు, ఎదుర్కోటానికి ఇంటిదగ్గరే నేర్చుకోడానికి వీలుగా బొమ్మలతో వివరింపబడిన అంబడిపూడి పుస్తకాలు. 1) కరాటే 2) చీనా కరాటే 3) జూడో 4) కుంగ్ ఫూ 5) ఫైటింగ్ 6) యోగ 7) సవాల్ 8) బ్రూస్‌లీ పూర్తి జీవిత రహస్యం. 9) మహామ్మద్ ఆలి.

30 రూపాయలు పంపినవారికి రిజిష్టర్డు పోస్టులో పంపబడును. V. P. పద్ధతి లేదు.

జలజ ప్రచురణలు,

విజయవాడ-3.

ESWAR




## ఆత్మ రక్షణ

కన్ను చెదిరే మంటతో మరియు పిడుగు వంటి శబ్దముతో మిమ్ములను దొంగల నుండి మరియు క్రూరమృగములనుండి ప్రమాదములకు గురికాకుండా కాపాడుటకు గృఢమైన లోహముతో పెద్దసైజు 50 షాట్ల ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ ఆటోమేటిక్ పిస్టల్.




గన్ను నలుపు రంగు విలువ రు. 66-50 మాత్రమే. లెదర్ కేస్ మరియు 100 బుల్లెట్లు ఉచితం. అదనంగా బుల్లెట్లు రు. 5/- నూటికి పోస్టేజి రు. 8-50.

**Packard Agencies (AJ)**

MATHURA-9

అక్కసు పటలేని తల్లి.

శారద తల వంచుకుంది.

"అంత తెగించినదానికి ఇంక యీ యింటితో పనేముంది?" అంది తల్లి కోపంతో వణికే స్వరంతో.

"రెక్కలు వచ్చాయి. ఎగిరిపోతుంది...." అన్నాడు రాజారావు పొంగి వచ్చే ఆక్రోశం దిగమింగుకుంటూ.

## 2

శారద వేరింటి కాపురం పెట్టిన కొత్తలో జీవితం ఇంద్రధనస్సులాగా శోభలు వెద జల్లింది. మధు ఒంటరిగాడు. నా అన్నవారెవరూ లేరు. శృతికలిసిన హృదయాలు ఆలపించే అనురాగ గీతాలతో దినాలు మధురక్షణాలుగా పరుగులు తీశాయి.

చిన్న నృత్యపాఠశాల నెలకొలిపి బాలికలకు నాట్యం నేర్పటంవల్ల వచ్చే ఆదాయంతోనూ, మధ్య మధ్య ప్రదర్శనాల వల్ల సంపాదించే ధనంతోనూ ఏ కొరతా లేకుండా కాలం గడిచిపోతోంది.

తొలివలపుల గుబాళింపుతో జీవనం నందన వనంగా అందాలు చిందింది.

ఈ దంపతుల అన్యోన్యంచూసి రాకాసి విధికి కన్ను కుటింది కాబోలు. భార్య సంపాదనతో సోమరిపోతుగా తయారైన మధు స్వభావంలో అనుకోని మార్పు వచ్చింది. క్లబ్బుకి వెళ్ళి స్నేహితులతో అర్ధరాత్రిదాకా పేకాటలాడి జేబు ఖాళీ చేసుకుని ఇంటికి రావడం సాగించాడు. శారద సంపాదనతో జల్లెడలో పోసిన నీళ్ళమాదిరి అయిపోతోంది. సంసారపు భారమంతా శారద మోయలేక క్రుంగిపోతోంది.

నిప్పుకు గాలితోడైనట్లు పేకాటతోపాటు తాగుడు కూడా అలవాటయింది. తూలుతూ సోలుతూ ఎప్పుడో ఇంటికి చేరుకునేవాడు. శారద ఎంతో బుజ్జగించి బ్రతిమాలుకునేది. "ఇంక రేపటి నుంచీ తాగను" అని ఒట్టుపెటుకునేవాడు. "నేను నీకు చాలా అన్యాయం చేసున్నాను, ద్రోహం చేస్తున్నాను- నన్ను క్షమించు" అని కళ్ళనీళ్ళు పెట్టుకునేవాడు. కాని మర్నాడు మళ్ళీ ఎప్పటి ఆటే సాగేది.

మధుర స్వప్నాలన్నీ మంచు తెరల్లాగా కరిగిపోతున్నాయి. ఆశల పూలపడవ నిష్ఠుర వాస్తవాల కఠిన శిలలకు ఢీకొని తునాతునకలైపోతోంది. ఇరుగుపొరుగు వాళ్ళందరికీ మధు సంగతి తెలిసిపోయింది. నాట్యపాఠశాలకు పిల్లలను పంపటం క్రమంగా తగ్గిపోయింది. సంసారం గడవటం కూడా కష్టమయే పరిస్థితులు దాపురించాయి. ఇంట్లోవున్న వెండి బంగారాలు

## దసరాల సరదాలు

వచ్చె సొంపుగా దసరాలూ!
తెచ్చె నింపుగా సరదాలూ!!
వెన్నెల తెన్నుల వచ్చినవీ!
పూవుల తావుల తెచ్చినవీ!!

అవి దేవీ నవరాత్రములూ!
అవే శరన్నవరాత్రములూ!!
గుడిలో తల్లికి చెలు ముడుపులూ!
బడిలో పిల్లల కాటవిడుపులూ!!

ఇంటిలోపలా బొమ్మల కొలువూ
ఆడువారి పేరంటములూ!
ఊరి వెలుపలా జమ్మికొట్టుటా
వేడుకలూ మగవారలకూ!!

ఆయుధ పూజలు-పుస్తక పూజలు-
సర్వకళల ప్రోత్సాహములూ!
యువతీ యువకానంద కరమ్ములు-
నవతా సమతా దివ్య వరమ్ములు!!

డాక్టర్ పింజమహారి

ఒకటొకటిగా గడపదాటి మార్వాడీ షాపుకు చేరుకుంటున్నాయి.

క్లబ్బుకి వెళ్ళద్దని శారద అడ్డం నిలబడితే పక్కకు నెట్టివేసి దూసుకుపోయాడు. ఆ తోపుకు శారద తల ద్వారబంధానికి గట్టిగా తగిలి నెత్తురు చిమ్మింది. వెనక్కి తిరిగి చూడకుండా మధు దూసుకుని వెళ్ళిపోయాడు.

ఎవరితో చెప్పుకోవాలి తన బాధ? తల్లీ తండ్రీ తనను ఎంతో మురిపెంగా పెంచుకున్నారు. వాళ్ళ అనుమతి పొందకుండా తను తెగించి మధును వివాహం చేసుకుంది. తేనెలొలికే వలపుల పలుకులతో వలలోవేసుకున్నాడు. అరిచేతిలో వైకుంఠం చూపించాడు. కళ్ళు మూసుకుని లోతు తెలియని చీకటి బావిలోకి ఉరికినటయింది. తన అంచనాలన్నీ ఈవిధంగా తలకిందులౌతాయని శారద కలలోకూడా అనుకోలేదు.

ఎంతో సేపటికి తెప్పరిల్లుకుని లేచి కళ్ళు తుడుచుకుంది. అద్దాల బీరువా, అందులో అమర్చిన ప్రశంసాపత్రాలూ, షీల్డులూ, కప్పులూ.... వాటి మధ్య వెండితో చేసిన చక్కని నటరాజ ప్రతిమ..రాజమండ్రిలో

ప్రదర్శనం కాగానే ఆనంద పారవశ్యంలో ఓలలాడిన రసిక హృదయాలు ఆశీస్సులతో బహూకరించిన విగ్రహం... కనబడలేదు. ఆ స్థానం వెలితిగా కొట్టవచ్చినట్లుగా... శారద కాళ్ళకింద నేల కంపించినట్లయింది, ఇల్లు మూలమూలలా గాలించింది. ఆపుకోలేని ఆవేశంతో, ఆక్రోశంతో తను సర్వస్వంగా నమ్మకుని ప్రాణప్రదంగా కాపాడుకొంటున్న నటరాజ్... కనపడకపోయేసరికి ఒక్కసారిగా మనస్సులో కారు చీకట్లు అలుముకుపోతున్నాయి తనకున్న సంపదంతా క్షణంలో మాయమైపోయి తాను దిక్కులేని బికారి అయిపోయినట్లు.... "అమ్మా!" అనే ఆక్రందన శారదకు తెలియకుండానే అంతరాంతరాలనుంచి ఎగసి వచ్చింది.

కన్నీళ్ళతో నిరీక్షిస్తూ కూచున్నది శారద రాత్రి ఒంటిగంటకు మధు తూలుతూ కూనిరాగాలు తీస్తూ ఇంటికి చేరుకున్నాడు. శారద భర్త భుజాలు పట్టుకుని కుదుపుతూ "ఏం చేశారో చెప్పండి. ఎక్కడ తాకట్టుపెటారో చెప్పండి" అని గట్టిగా నిలదీసి అడిగింది.

మొదట నాకు తెలియదని బుకాయించాడు నేను దొంగననుకున్నావా, అని కోపంగా అరిచాడు

శారద రెచ్చిపోయి నిజం చెబితేకాని వదలనని కేక పెట్టింది. చివరికి తొణుకూ బెణుకూ లేకుండా "అమ్మేశాను" అన్నాడు మధు

"ఎంత పని చేశారు? చేతులెలా వచ్చినై మీకు?" అని దెబ్బతిన్న నాగుపాము లాగా బుసకొటింది శారద.

"నా యిష్టం, నువ్వెవరివి నన్ను అడగటానికి." అంటూ ఉగ్రుడైపోయి బెల్టు తీసి శారద వీపుమీద ఛళ్ళున దెబ్బవేశాడు.

నిశ్చేష్టురాలై క్షణంసేపు మౌనంగా నిలబడింది. మధును నిలువునా దగ్ధం చేయాలనే ఆగ్రహ జ్వాల శారద హృదయంలో నాలుకలు జాపింది. సంబాళించుకుంటూ "బాగుంది ప్రయోజకత్వం. దెబ్బలు తింటూ పడి వుంటానికి మీ బానిసను కాను" అంది.

"మళ్ళీ నోరెత్తావంటే చంపేస్తాను" అంటూ మైకంలో మీదికి దుమికాడు.

"ఆ శ్రమ మీకు దేనికీ? నేనే వెళ్తున్నాను. నా నటరాజమూర్తి లేని ఈ నరకంలో నేను క్షణం కూడా నిలువలేను."

"అయితే పద బైటికి. ఫో. నీ నటరాజు దగ్గరికే ఫో." అంటూ మెడ పట్టి బైటకి తోశాడు.

ఇల్లు విడిచి వీధిలోకి వచ్చింది శారద ఆకాశంలో నక్షత్రాలు కొలువు తీర్చిన





## కావలెను

Regd by Government

S. S. C.. Inter చదివిన విద్యార్థినీ విద్యార్థులకు అగ్రికల్చర్ కోర్సులో 2 నెలలు శిక్షణ యిచ్చి ఈ క్రింది ప్రభుత్వోద్యోగములలో నియమించబడుటకు అర్హులు. ఉచితము : శిక్షణలో చేరు ప్రతివారికి స్టయిఫండు రు. 105/-లు, భోజనము, పుస్తకములు, హాస్టలు వసతులు కలవు స్త్రీలకు ఎంబ్రాయిడరీ, అల్లికలు ఉచితంగా నేర్పబడును. టైపు, షార్టుహాండు, టైలరింగ్ నేర్చుకొను వసతికలదు. ఉద్యోగములు : 1) Field Man 2) Field Asst 3) Sub Asst 4) V.D.O. 5) Tech Asst 6) Sugar cane Asst జీతం : రు. 450/- to 750/-లు అర్హతలు : 7th Pass to Degree వయస్సు ; 15 to 35 వరకు. స్త్రీలకు ప్రత్యేక హాస్టలు కలదు. Postal ద్వారా కూడా తెలుగులో శిక్షణ కలదు. పై ప్రభుత్వోద్యోగములు చేయుటకు శిక్షణ పొందువారు దిగువ అడ్రసుకు ఈ ప్రకటన వెలువడిన 10 రోజుల లోగా రు. 4/-లు M.O. చేసి అప్లికేషన్ పొందగలరు.

**PRINCIPAL,**
Sri Nagarjuna Agricultural Technical Training Institute,
GUNTUR-522006 or CHILAKALURIPET, Guntur Dt A. P.




ప్రేక్షక సమూహంలాగా మానవ జీవన నాటకాన్ని మౌనంగా చూస్తున్నాయి. దూరాన రైలు సిగ్నలు దీపం రుద్ర నేత్రంలాగా మెరుస్తోంది. కట్టలు తెంచుకునే దుఃఖంతో, ఆవేశంతో చీకట్లో సాగిపోయింది శారద.

## 3

"నేనెక్కడున్నాను?" అంది శారద నీరసంగా.

"అమ్మయ్యా! స్పృహ వచ్చిందండి!" అని ఆనందంతో కేక పెట్టింది తల్లి.

"అమ్మా, శారదా! ఎంతపని చేశావు తల్లీ" అంటూ రాజారావు శారద పక్కలో కూచుని తల నిమురుతూ పొర్లి వచ్చే దుఃఖం ఆపుకున్నాడు.

శారద తల్లిదండ్రులను గుర్తు పట లేదు. శూన్యంలోకి చూస్తూ "నేనెక్కడున్నాను" అంది మళ్ళీ.

"నీకేం భయం లేదమ్మా. మేమున్నాముగా తల్లీ" అంటూ శారద చేతిని తన రెండు చేతులతోనూ ఆప్యాయంగా రాస్తూ గుండెలకు హత్తుకున్నది తల్లి.

శారద కళ్ళు ఆసుపత్రి గది కప్పువంక, గోడలవైపూ చూస్తున్నాయి. ఆ చూపులో ఎటువంటి తెలివి కనబడటం లేదు.

పదిహేను రోజుల తరవాత ఇప్పుడే శారద కళ్ళు తెరిచింది. ఆమె నోట్లోంచి ఒకే ఒక వాక్యం వెలువడింది. రాజారావు ఎంతో ఆదుర్దాగా శారదా శారదా అని ఎన్నోసార్లు పిలిచాడు. శారద మరో ప్రపంచంలో ఏదో దూర తీరాన సంచరిస్తున్నట్లుగా కనిపించింది. సువాసన వీడిన తరవాత కొమ్మకు వ్రేలాడే సంపెంగ పువ్వులాగా తోచింది. కూతురుకు స్పృహ వచ్చిందన్న ఆనందం తొలకరి మెరుపులాగా క్షణం తళుక్కుమని మబ్బుల్లో మాయమై పోయింది.

ఆ రాత్రి జరిగిన విషాద సంఘటన రాజారావు మనస్సులోంచి తొలగిపోవటం లేదు. తమకు కబురంది వెళ్ళేసరికి రైలు పట్టాల పక్కన శారద స్పృహ లేకుండా పడి వుంది. నెత్తురు మడుగులో రక్త మందారంలాగా నిర్జీవంగా కనిపించింది. రైలు చక్రాల కిందపడి రెండు కాళ్ళూ తెగిపోయాయి. కొనవూపిరితో ప్రాణం కొట్టుకుంటున్నది. బుజాన వేసుకుని ఆసుపత్రికి ఎల్లాగో చేర్చాడు.


ప్రసిద్ధ నర్తకిగా శారదను ఎరిగున్న వైద్య ప్రముఖులు ప్రత్యేక శ్రద్ధ చూపించారు. శస్త్రచికిత్సచేసి కాళ్ళు రెండూ తీసివేశారు. ఆ దుర్భర దృశ్యం చూసి రాజారావు కళ్ళు తిరిగి పడిపోయాడు.

పారాణి దిద్దుకుని లయలహొయలు మెరిపించిన శారద పాదాలు, గజ్జెల గలగలతో పాటలకు ప్రాణంపోస్తూ తటిల్లతలాగా విన్యాసాలు వెలయించిన పాదాలు అంతా ఒక మరుపురాని పీడకల.... అంత దారుణం జరిగినా తనకేమీ పటనట్లు వెళ్ళిపోయింది రైలు.

క్రమంగా తేరుకుంటుందనీ, నిరాశపడవద్దనీ వైద్యులు హామీ యిచ్చారు. శారదకు కలిగిన విపత్తుకు గుండెలు కరిగి తన సొంత డబ్బుతో ఒక చక్రాల కుర్చీకొని కానుకగా ఇచ్చాడు. ఆపరేషను చేసిన డాక్టరు సుందరరావు. మహోజ్వలభవిష్యత్తు వున్న నర్తకీమణి జీవితం ఈ విధంగా తలకిందులై పోయినందుకు ఆయన ఎంతో ఆవేదనపడ్డాడు. శారదను ఇంటికి పంపిన తరవాత కూడా తరుచుగా వచ్చి చూసి పలకరించి వెళ్ళేవాడు.

ఇంటికి వచ్చిన తరవాత కూడా శారదలో మార్పు రాలేదు. ఎవరైనా పలకరిస్తే బిత్తర చూపులు చూస్తూ "నే నెక్కడున్నాను?" అనేది.

"మన యింటికి వచ్చేశామమ్మా. అదుగో నీ వీణ. ఇదుగో నీ తబలా. ఇవిగో నీ గజ్జెలు" అంటూ రాజారావు శారదకు పూర్వస్మృతి కలిగించాలని యెంతో ప్రయత్నించాడు. కాని శారద






యేదో లోకంలో సంచరిస్తున్నట్లుగా శూన్యంగా చూసింది.

తలి అన్నంకలిపి ముద్దలు నోటికి అందిస్తే యాంత్రికంగా తిన్నదికాని నోరువిప్పి యేమీ అడగలేదు.

"శారదని ఈ స్థితికి తెచ్చిన ఆ దుర్మార్గుడి రక్తం కళ్ళ చూస్తాను" అంటూ రాజారావు మధుకోసం వూరంతా గాలించాడు. శారదను యింట్లోంచి గెంటివేసిన కొంచెంసేపటి తరవాత మధు బైటికి వెళ్లాడనీ మళ్ళీ తిరిగి రాలేదనీ యింటివాళ్ళు చెప్పారు. ఆ తరవాత అతను యేమైపోయాడో యెవరికీ తెలియదు. అమాయక జీవితాలతో చెలగాటం ఆడటానికి అలవాటుపడిన మధు రంగంమార్చి మామూలు నాటకమే మరొకతావున ప్రారంభించి వుంటాడు. తీరని అక్కసుతో రాజారావు గుండెలు భగ్గుమన్నాయి.

ఇటువంటి దుస్థితిలో శారదను చూస్తూ దుర్భరశోకాన్ని లోపలనే దిగమింగుకుంటూ చంటిపిలను సాకినట్లుగా తల్లి పరిచర్యలు చేస్తోంది.

దీర్ఘవ్యాధులకు ఉత్తమ వైద్యం!



దురభ్యాసములకులోనై దాంపత్యసౌఖ్యంపొందలేనివారు,హెర్నియా. చర్మవ్యాధులకు పోస్టుద్వారావరిబీజము(బుడ్డ). మూత్రవ్యాధులు, ఇస్నోఫీలియా. దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషన్‌లేకుండ రండి.

డా॥ దేవర,
5/1,బ్రాడిపేట, గుంటూరు-2
బ్రాంచిలు: 26,నార్త్‌బోగ్‌రోడ్,మద్రాసు-17.
మార్వాడిగుడివద్ద,తెనాలి.ఫోన్.551.

శారదకు సంగీతం నేర్పిన రాజేశ్వరమ్మగారు వచ్చి గౌసెనవేసిన వీణ వెలుపలికి తీసి శృతిచేసి "గిరిరాజసుతా, తనయా, సదయా!" అనే పల్లవి వాయించింది. శారద కళ్ళలో యేదో తళుకు మెరిసింది.

"తరవాత చరణం పాడవే శారదా!" అంది టీచరుగారు. శారద కళ్ళల్లో నీళ్ళు చిందినయ్. పెదిమలు వణికినై. అంతే. "నేనెక్కడున్నాను?" అన్న మాటలే వెలువడినాయి.

"ఈ యింట్లో ముగ్గురం జీవచ్ఛవాలుగా ఎన్నాళ్ళు పడి వుంటాం? ఈ దిక్కుమాలిన వూరు విడిచి ఎక్కడికైనా వెళ్ళిపోదాం' అన్నాడు రాజారావు.

"ఊరు మారినంతలో రాత మారుతుందా." అంది రాజేశ్వరి.

అంటుండగానే "టెలిగ్రామ్ సార్!" అనే కేక వినబడి త్రుళ్ళిపడ్డాడు రాజారావు.

"ఇదుగో రేపు పొద్దున రైల్లో మీ తమ్ముడు వస్తున్నాడట. అమెరికా నుంచి. బొంబాయి వచ్చి టెలిగ్రామ్ ఇచ్చాడు" రాజారావు.

"నిజంగానా? పదేళ్ళయిపోయింది. మనం గుర్తున్నామన్న మాట" అంది భార్య.

## 4

అమెరికా పాపాయి ఆ యింటికి వచ్చిన క్షణం నుంచీ పరిసరమంతా ఆనందంతో తొణికిసలాడుతోంది. రాజారావు బావమరిది అమెరికాలో గొప్ప ఆసుపత్రిలో డాక్టరుగా పనిచేస్తున్నాడు. మానసిక వ్యాధుల నివారణలో ఎన్నో పరిశోధనలు చేసి గొప్ప పేరు సంపాదించాడు. అమెరికన్ వనితనే వివాహం చేసుకున్నాడు. వాళ్ళ పాప సుజాత. ఎనిమిదో యేడు. భార్యకూ, కూతురుకూ భారతదేశం చూపించాలనే కోరికతోవచ్చాడు అక్కనూ, బావనూ చూసి పోదామని వచ్చాడు. శారద విషాదగాథ విన్నాడు. దిగులు పడవద్దని అక్కకు ధైర్యం చెప్పాడు.

చక్రాల కుర్చీలో వున్న శారద చుట్టూ గంతులేస్తూ వచ్చీరాని తెలుగులో పలకరిస్తూ వుంటూంది అమెరికా పాపాయి. శారద కళ్ళలో దరహాసరేఖ మెరిసి మాయమై పోతోంది.

ఆ పాపకు అమెరికాలో రాజసులోచన అనే తమిళ నర్తకి భరతనాట్యం నేర్పింది. అడుగులు చక్కగా వేస్తుంది. నడుస్తుంటే ప్రతి అవయవమూ లయబద్ధంగా కదులుతుంది. కళ్ళతోనే ఎన్నో హావభావాలు పలికిస్తుంది సుజాత.

మూటగట్టి మూలపడేసిన గజ్జెలను గలగలలాడించి మురిసిపోయింది. ఆ ధ్వని విని శారద కళ్లు మెరిపిస్తూ ఆ వంక చూసింది. మూగవోయి మూలపడిన శారద గజ్జెలు సుజాత పాదాలను అలంకరించాయి. బూజుపట్టిన గౌసెనలోంచి వీణ తీసి చక్రాలకుర్చీలో కూచున్న శారద చేతికి అందించి "నేను డాన్సుచేస్తా, నువ్వు వీణ వాయిస్తూ పాడాలి వదినా!" అంది.

శారద అయోమయంగా చూసింది. "ఊఁ, రెడీ." అంటూ పాప అడుగులు వేసింది. మూగవోయిన గజ్జెలకు ప్రాణం వచ్చింది.

"ఇందిరా మందిరా భక్త..." అని చక్కగా నృత్యంచేసూ తరవాత మాటలు మరిచిపోయినట్లుగా శారద చూసింది.

"సుందరా వదనారవిందా బృందభక్తి మకరందా...." అనే పలుకులు అప్రయత్నంగా శారద అందిస్తూ వీణ మీటింది.

శారద నయనాంచలాల నుంచి బాష్పబిందువులు వీణ మెట్లమీద రాలినయ్.

లోపలి నుంచి వచ్చిన రాజారావు ఈ దృశ్యం చూసి "సుజా! మమ్మల్ని బతికించావమ్మా" అంటూ "ఏమేవ్. ఏం చేస్తున్నావు వంటింట్లో, త్వరగా రావాలి" అని కేక పెట్టాడు.

"ఇందిరా మందిరా భక్త సుందరా వదనారవిందా" అని శారద వీణ మీటుతూ మధురంగా ఆలపించటం విన్న తల్లి "అమ్మా శారదా!" అంటూ ఆనందాతిశయంతో శారద తలను గుండెలకు హత్తుకుంది.

"అమ్మా!" అంది శారద అశ్రుపూరిత నయనాలతో తల్లి ముఖం వంక చూసూ.

కిటికీ చేరువలో వున్న మామిడి చెట్టు కొమ్మ మీద వాలిన కోకిల కొసరి కొసరి కూసింది. ★